కిష్టూనాయక్ తండాలో బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న చిన్నారి దక్షిత

నా కొడుకును కాపాడండి

- అనారోగ్యంతో దవాఖానలో చేరిండు
- ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నం
- దాతలూ ఆపన్నహస్తం అందించండి
- కిష్టూనాయక్‌తండాలో తల్లిదండ్రుల వేడుకోలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 30: రాళ్లు కొట్టుకుని, రెక్కలు ముక్కలుజేసుకుని కొడుకులకు సాదుకున్నరు. చెట్టంత ఎదిగిన బిడ్డలను చూసి సంబురపడ్డరు. అంతా మంచిగున్నదని అనుకున్న సమయంలో పెద్దకొడుకుకు క్యాన్సర్ అనే తెలియడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నరు. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నరు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలం కిష్టూనాయక్‌తండా పంచాయతీ పరిధిలో ఒడ్డెర కాలనీకి చెందిన శివరాత్రి దేవయ్య-లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కొడుకు వంశీ(19) చిన్నాచితక కూలీ పనులు చేస్తుండేవాడు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో ఇబ్బందిపడుతుంటే దవాఖానలో పరీక్షలు చేయించగా, బ్లడ్ క్యాన్సర్ అని తేలింది. ఆరు నెలలుగా కుమారుడి చికిత్స కోసం అందినకాడ్ల అప్పు చేసి ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే దవాఖానలో వంశీ చికిత్స పొందుతుండగా, దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సాయం చేయాలనుకునే వారు ఫోన్‌పే నంబర్ (93470-43861) కి పంపాలని వేడుకున్నారు. ఎన్ఆర్ఐ దరావత్ సురేశ్‌నాయక్ తన కూతురు దక్షిత బర్త్‌డే సందర్భంగా వంశీ వైద్య చికిత్స కోసం ఆదివారం బాధిత కుటుంబానికి రూ.5 వేలు అందించారు.

బాధిత కుటుంబ సభ్యులకు రూ.1.45 లక్షల సాయం అందజేస్తున్న ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, రమేశ్

ఫేస్ బుక్ మిత్రుల ఔదార్యం

మంచానికి పరిమితమైన బాధితుడికి రూ.1.45 లక్షల సాయం

ధర్మపురి, జూన్ 30 : కాళ్లు, చేతులు పని చేయకుండా రెండేళ్లుగా మంచానికే పరిమితమైన ఓ బాధితుడికి ఫేస్‌బుక్ మిత్రులు రూ.1.45 లక్షల సాయం అందించి తమ ఔదర్యాన్ని చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ధర్మపురి పట్టణానికి చెందిన డోంగిరి సురేశ్ గత కొన్నేళ్లుగా ఆటో నడుపుకొంటూ అద్దె ఇంట్లో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో రెండేళ్ళ క్రితం వెన్నెముకకు సమస్య ఏర్పడడంతో శస్త్ర చికిత్స చేయించగా సర్జరీ విఫలమైంది. దీంతో అతని రెండు కాళ్లు, చేతులు పని చేయక మంచానికే పరిమితమయ్యాడు. సురేశ్ భార్య పద్మ కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్నది. వీరి పరిస్థితిని స్థానికుల ద్వారా తెలుసుకున్న ధర్మపురి పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ ఫేస్ బుక్‌లో జూన్ 3న పోస్ట్ చేశాడు. దీంతో స్పందించిన దాతలు రూ.1.45 లక్షలు వివాళాలు పంపించగా, వాటిని ఆదివారం ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఆశిష్ చేతుల మీదుగా బాధితుడి భార్య పద్మకు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్, దాతలను సీఐ అభినందించారు.

ఓపీ, ఐపీలు రెట్టింపు అయ్యాయి

కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. ఓపీ, ఐపీలతో దవాఖాన కిటకిటలాడుతున్నది. పూర్తి స్థాయిలో మందులు, వైద్యులు అందుబాటులోకి రావడంతో, గతంలో నెలకు 200 లోపు అయిన ప్రసవాలు ప్రస్తుతం 800 వరకు దాటుతున్నాయి. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలకు ప్రోత్సాహకాలు అందించడంతోపాటు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యాక ఇంటికి వెళ్లే వరకు పూర్తి స్థాయిలో భరోసా కల్పించడంతో జిల్లాలో వందకు 80 శాతం ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రసవాలు జరుగుతున్నాయి.

- డాక్టర్ గుండా వీరారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కరీంనగర్

సామాన్యుడికీ అసమాన వైద్యం

సామాన్యుడికి అసమాన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన రేనే దవాఖానను ప్రారంభించాం. గుండె, ఆర్థో, యురాలజీ, నెఫ్రాలజీ సేవలు ఆరోగ్యశ్రీలో అందుబాటులో ఉన్నాయి. వైద్య పితామహుడు బీసీ రాయ్‌ను ప్రతి వైద్యుడూ ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన స్ఫూర్తితో తన తల్లి బంగారి లక్ష్మి పేరిట ఏటా 15మందికి పైగా పేదలకు ఉచితంగా కీలు మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తున్నాం.

- డాక్టర్ బంగారి స్వామి

వైద్యులూ.. మీకు సలాం

- కనిపించే దేవుళ్లు డాక్టర్లు
- నేడు ప్రపంచ వైద్యుల దినోత్సవం

మంచి చేయాలనే చూస్తరు

వైద్యులు రోగులకు మంచి చేయాలనే చూస్తరు. అన్నిసార్లు ప్రాణాలు కాపాడడం సాధ్యంకాదు. కొందరు ఈ మధ్య కాలంలో వైద్యులను బ్లాక్‌మెయిల్ చేయడం పరిపాటిగా మారింది. వైద్య వృత్తిపై ప్రజల్లో నమ్మకం పెరగాలి. ఇందుకు వైద్యులూ కృషిచేయాలి. ప్రజలు వైద్యులను దేవుళ్లతో సమానంగా చూస్తారు. అదే స్థాయిలో వైద్య సేవలందించాలి.

- డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్ కుమార్

వైద్యులపై నమ్మకం ఉండాలి

రోగులకు వైద్యులపై నమ్మకం ఉండాలి. 24 గంటలూ రోగుల సేవలోనే ఉండే డాక్టర్లను నమ్మకపోతే ఎవరిని నమ్ముతారు. కానీ, అత్యవసర పరిస్థితుల్లో రోగి బంధువులు నానా హంగామా చేస్తారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇప్పుడు కరీంనగర్‌లోనే అన్నిరకాల వైద్య సేవలు, అత్యాధునిక వసతులతో పేదలకు అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, ఫిజీషియన్

జన్మనిచ్చేది అమ్మ అయితే, పునర్జన్మనిచ్చేది వైద్యులు.. విలువైన ప్రాణాలు కాపాడే ప్రాణదాతలు.. కనిపించే దేవుళ్లు.. వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. అలాంటి వైద్యుల కోసం ప్రపంచమంతా ఒక రోజు కేటాయించింది. నేడు ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా పలువురు వైద్యులు 'నమస్తే తెలంగాణ'తో తమ మనోభావాలను పంచుకున్నారు.

- విద్యానగర్, జూన్ 30

'వైద్యో నారాయణ హరి' అనగా వైద్యులు దేవుడితో సమానం అని అర్థం. ఆపదలో వచ్చిన వారికి స్వాస్థత చేకూర్చి, ప్రాణాలు నిలుపడమే కర్తవ్యంగా భావిస్తుంటారు. ఏ సమయంలో వచ్చినా, ఎలాంటి పరిస్థితుల్లో దవాఖానలో చేరినా చిరునవ్వుతో చికిత్స అందిస్తుంటారు. వ్యక్తిగత జీవితాలను సైతం కోల్పోతూ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించేందుకు అహోరాత్రులు శ్రమిస్తుంటారు. నిద్రాహారాలు మాని రోగుల సేవలో తరిస్తున్నారు.

సమాజంలో వైద్యుల పాత్ర కీలకం

సమాజంలో వైద్యుల పాత్ర చాలా కీలకమైనది. విపత్కర పరిస్థితుల్లో కూడా వారు అందించే సేవలు శ్లాఘనీయం. గతంలో అనేక వ్యాధులు, రోగాల బారి నుంచి ఈ ప్రపంచాన్ని రక్షించారు. మన కండ్ల ముందే వీర విహారం చేసిన కరోనా వైరస్‌ను కూడా సమర్థవంతంగా ఎదుర్కొని మానవ జాతికి ఉపశమనం కలిగించారు. ఇలాంటి అనేక సందర్భాల్లో తమ సేవలఅందించి మానవ మనుగడను సురక్షితంగా ముందుకు నడిపిస్తున్నారు. దురదృష్టవశాత్తు కొన్ని కార్పొరేట్ సంస్థలు డబ్బే ప్రధానంగా సేవలు విక్రయిస్తున్నారు. ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

కార్పొరేట్ తరహాలో వైద్యం

కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా ప్రజలకు వైద్యం అందుతున్నది. ఇప్పటికే ఇక్కడ ఖరీదైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. దవాఖానలో మోకాలు కీలు మార్పిడిలు, తొంటి మార్పిడిలు, కంటి శస్త్ర చికిత్సలు ఇంకా క్లిష్టమైన శస్త్ర చికిత్సలు ఎన్నో చేస్తున్నాం. ప్రభుత్వం వైద్యులకు పూర్తి స్థాయిలో పరికరాలతో పాటు మందులను అందించడంతో శస్త్ర చికిత్సలు చేసేందుకు వైద్యులు ముందుకు వస్తున్నారు. కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో రోజుకు పదికి పైగా శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. గతంలో నెలకు 20 శస్త్ర చికిత్సలు కాగా, ఇప్పుడు నెలకు 500లకు పైగా శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. ఇప్పటికే దవాఖానకు పూర్తి స్థాయిలో అత్యాధునిక పరికరాలతో పాటు మెడికల్ కళాశాల రావడంతో రానున్న రోజుల్లో వైద్య సేవలు మరింత రెట్టింపు అవుతాయి.

- డాక్టర్ నవీనా, ఇన్‌చార్జి ఆర్ఎంవో

జాగ్రత్తలు తీసుకోవాలి

అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నా.. జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. లేకుంటే ఆనారోగ్యం బారిన పడే అవకాశం ఉన్నది. పూర్వ కాలంలో శారీరక శ్రమ ఎక్కువగా ఉండడంతో దీర్ఘకాలిక వ్యాధులే ఉండేవి కాదు. ప్రస్తుతం బీపీ, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్, ఉబకాయం వంటి అధికం అవుతున్నాయి. వీటిపై ప్రజలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది.

- డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్

మొబైల్ ఎక్కువగా చూడొద్దు..

మొబైల్ ఎక్కువగా చూడడంతో కంటిచూపు సమస్యలు వచ్చే అవకాశం ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా 300 మిలియన్ల కంటే ఎక్కువ మంది దృష్టిలోపంతో బాధపడుతున్నరు. మంచి ఆహారం తీసుకోవడం ద్వారా కండ్లను కాపాడుకోవచ్చు. డయాబెటిక్ పేషెంట్లు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలి. కంటి సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- శ్రీధర్, ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు

రాష్ట్రం నిధులివ్వకపోవడం దుర్మార్గం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

విద్యానగర్, జూన్ 30: అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధిలో భాగంగా బీజేపీ ఎమ్మెల్యేలకు రాష్ట్ర సర్కారు నిధులివ్వకపోవడం దుర్మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే విధంగా వ్యవహరిస్తే పరిస్థితి ఏమవుతుందో ఆలోచించాలని సూచించారు. ఆదివారం ఆయన కరీంనగర్ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం మంత్రులు, ఎంపీలు తమను సంప్రదిస్తే పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మాత్రమే నిధులిచ్చి.. మిగతా ఎమ్మెల్యేలకు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. బీజేపీ గెలిచినచోట్ల ఆయా నియోజకవర్గాల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులకు నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా పెట్టి నిధులివ్వడం సరికాదన్నారు. కేంద్రంలో తాము కూడా అలాగే చేస్తే మీ పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించుకోవాలన్నారు. తమ మంచితనాన్ని పిరికితనంగా భావిస్తే మీకే నష్టమని తేల్చిచెప్పారు. అలాగే ఏపీ డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్‌కళ్యాణ్ తన ప్రతిపాదనను బీజేపీ ముందుంచారని, ఈ విషయంపై జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడితో సహా పార్టీ నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అలాగే టీ20 ప్రపంచ కప్‌లో ఘనవిజయం సాధించిన టీమిండియా జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

దళారీ వ్యవస్థను ఉపేక్షించబోం

పీఎం విశ్వకర్మ పథకం కోసం దరఖాస్తు చేసుకుంటే కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దళారీ వ్యవస్థను ఉపేక్షించబోమని, బాధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని బాధిత మహిళలకు హామీ ఇచ్చారు.

బాజా

మనలో చాలామంది క్రెడిట్ కార్డ్స్ వాడుతూంటారు. అయితే ఈ క్రెడిట్ కార్డుల్లో ఎన్ని రకాలున్నాయో.. వాటి లాభాలేంటో మీకు తెలుసా? బ్యాంకింగ్ రంగంలో ఉన్న ప్రస్తుత పోటీ వాతావరణంలో కస్టమర్లను ఆకట్టుకోవడం ఓ పెద్ద టాస్క్ అయిపోయింది. అందుకే యూజర్ల అవసరాలకు, అలవాట్లకు తగ్గట్టుగా ఒక్కో కార్డుకు ఒక్కో రకంగా ప్రయోజనాలను చేర్చి అందిస్తున్నాయి ఆయా సంస్థలు.

అక్కెరకో క్రెడిట్ కార్డ్



బేసిక్ క్రెడిట్ కార్డ్స్

బ్యాంకులు, సంస్థలు తమ కస్టమర్లకు ఉచితంగానే ఇస్తున్నాయి. మరికొన్ని తక్కువ ఫీజును వసూలు చేస్తున్నాయి. పెద్దగా బెనిఫిట్స్ ఏవీ ఉండవు.

రివార్డులకు..

క్రెడిట్ కార్డ్స్‌ను ఎక్కువగా వాడేవారికి ఇవి ఉత్తమం. ప్రతీ కొనుగోలుపై రీడిమబుల్ రివార్డ్స్ యాడ్ అవుతాయి.

క్యాష్ బ్యాక్ కోసం..

వీటితో మనం కొనే వస్తువుల ధర కొంత మొత్తం తగ్గుతుంది. అకౌంట్లలో ఆ మొత్తాలు జమవుతాయి.

ప్రయాణాలకు వీలుగా..

ప్రయాణాలు ఎక్కువగా చేసేవారికి సౌకర్యంగా ఉంటాయి. ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్, హోటల్ చార్జీల్లో రాయితీ వంటివి అందుకోవచ్చు.

వ్యాపారస్తులకు ప్రయోజనకారిగా..

వ్యాపారులు, కంపెనీల యజమానుల కోసం వీటిని ఇస్తున్నారు. వ్యాపార లావాదేవీలపై రివార్డ్స్ పొందవచ్చు.

విద్యార్థుల కోసం..

పరిమిత రుణ చరిత్ర ఉన్నవారు, యువతకు లాభదాయకం. వార్షిక చార్జీ లుండవు. బోనస్ పాయింట్లు వస్తాయి.

కో-బ్రాండెడ్

వీటితో ఉచిత హోటల్ సర్వీసునూ అందుకోవచ్చు. అయితే హై ఎండ్ కస్టమర్లకే ఇవి దొరుకుతాయి.

స్టోర్ క్రెడిట్ కార్డ్స్

రిటైల్ స్టోర్ల ద్వారా ఇష్యూ అవుతున్నాయి. ఎక్కడైతే లేదా ఎవరైతే ఇస్తారో అక్కడే ఈ క్రెడిట్ కార్డ్స్ చెల్లుతాయి.

షాపింగ్ కోసం..

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ షాపర్స్‌కు సూటబుల్. వీటితో కొంటే డిస్కౌంట్లు, రివార్డులు, క్యాష్‌బ్యాక్ వంటి రకరకాల ఆఫర్లను అందుకోవచ్చు.

విమాన ప్రయాణికులకు..

విమానయాన సంస్థలతో కలిసి బ్యాంకులు వీటిని ఇష్యూ చేస్తున్నాయి. టిక్కెట్ల ధరపై రాయితీలు, రివార్డ్ పాయింట్లు అందుతాయి.

ఇంధన వినియోగదారులకు..

వీటితో వాహనదారులు పెట్రోల్, డీజిల్ పోయించుకున్నప్పుడు డిస్కౌంట్ పొందవచ్చు. సర్‌చార్జీలను తప్పించుకోవచ్చు.

వినోదాలకు వెళ్లేవారి కోసం..

సినిమాలకు తరచూ వెళ్లేవారి కోసం ఈ క్రెడిట్ కార్డులున్నాయి. సెక్యూరిటీపైనా క్రెడిట్ కార్డులను పొందవచ్చు. క్రెడిట్ స్కోర్‌తో సంబంధం లేకుండా నగదు గ్యారెంటీతో వీటిని జారీ చేస్తారు.

పోస్టల్ జీవిత బీమాకు పోదామా..

పీఎల్ఐ-ఆర్పీఎల్ఐకి ఉన్న ఐటీ ప్రయోజనాలేమిటి?



భారతీయ తపాలా కార్యాలయం (ఇండియా పోస్ట్ లేదా పోస్టాఫీస్) రెండు రకాల జీవిత బీమా పథకాలను అందిస్తున్నది. అవే.. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్పీఎల్ఐ). భద్రత, సుస్థిరతలకు మదుపరులు ముందుగా చూసేది పోస్టాఫీస్ స్కీములనేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ రంగ ఉద్యోగులకు, ఆయా రంగాల నిపుణులు, వ్యాపారులు, ఇతరత్రా వృత్తులవారికి అనేక ప్రయోజనాలను చేకూర్చే ఈ స్కీముల్లో బీమా పథకాలకు సైతం గొప్ప ఆదరణ ఉంటున్నది. వాటికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులు కూడా ఉన్నాయి. పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ ప్రీమియం చెల్లింపుల్లో పోస్టాఫీస్ రిబేట్‌ను ఆఫర్ చేస్తున్నది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పీఎల్ఐ స్కీంలో 6, 12 నెలలు లేదా ఆపై ముందస్తు పేమెంట్లకు 1 శాతం నుంచి 2 శాతం రిబేట్ వస్తున్నది. అలాగే ఆర్పీఎల్ఐ స్కీంలో 3, 6, 12 నెలలు లేదా ఆపై ముందస్తు చెల్లింపులకు 0.5 శాతం, 1 శాతం, 2 శాతం రిబేట్లు వర్తిస్తున్నాయి.

- పోస్టాఫీసుల్లో లేదా పోస్టల్ ఏజెంట్లను సంప్రదించి ఈ బీమా పాలసీలను తీసుకోవచ్చు.
- పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ పాలసీదారులు తమ ప్రీమియంలను దేశవ్యాప్తంగా ఉన్న ఏ పోస్టాఫీస్‌లోనైనా చెల్లించవచ్చు. పీఎల్ఐ పోర్టల్ ద్వారా లేదా డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా, భీమ్/యూపీఐ, నెట్ బ్యాంకింగ్ ద్వారా కూడా పేమెంట్స్ చేసుకోవచ్చు. ఉద్యోగులు తమ సాలరీ అకౌంట్ల నుంచి ఆటోమేటిక్ డెబిట్ కూడా చేయించుకోవచ్చు.
- ఈ పోస్టల్ బీమా పథకాలకు 19-55 ఏండ్లవారు అర్హులు.
- పాలసీ కోసం ఫొటోలు, ప్రపోజల్ ఫామ్, వయస్సు-చిరునామా ధ్రువీకరణ పత్రాలు, ఐడెంటిటీ ప్రూఫ్, అనారోగ్యం ఉంటే వాటి మెడికల్ రిపోర్టులు అవసరం.
- సమ్ అష్యూర్డ్ పరిమితి కనిష్ఠంగా రూ.10,000, గరిష్ఠంగా రూ.10 లక్షలు.
- పాలసీ తీసుకున్న 3 ఏండ్ల తర్వాత నుంచి రుణాలు, సరెండర్ సదుపాయం ఉంటుంది.
- పీఎల్ఐలో సుమంగళ్, బాల జీవన్ బీమాలపై రుణ సౌకర్యం, సరెండర్ అవకాశం లేదు.
- గ్రామీణ పీఎల్ఐలో గ్రామ ప్రియ, గ్రామ సుమంగళ్, బాల జీవన్ బీమాలపై రుణ సౌకర్యం, సరెండర్ అవకాశం ఉండదు.
- బాల జీవన్ బీమా పథకానికి 5-20 ఏండ్లవారు అర్హులు. తల్లిదండ్రుల వయసు 18-45 ఏండ్ల మధ్య ఉండాలి. కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరి పిల్లలకే పథకం వర్తిస్తుంది. గరిష్ఠ సమ్ అష్యూర్డ్ రూ.3 లక్షలు.

పీఎల్ఐ పథకాలు

- హోల్ లైఫ్ అష్యూరెన్స్ (సురక్ష)
- కన్వర్టబుల్ హోల్ లైఫ్ అష్యూరెన్స్ (సువిధ)
- ఎండోమెంట్ అష్యూరెన్స్ (సంతోష్)
- జాయింట్ లైఫ్ అష్యూరెన్స్ (యుగళ్ సురక్ష)
- యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అష్యూరెన్స్ (సుమంగళ్)
- చిల్డ్రెన్ పాలసీ (బాల జీవన్ బీమా)

ఆర్పీఎల్ఐ పథకాలు

- హోల్ లైఫ్ అష్యూరెన్స్ (గ్రామ సురక్ష)
- కన్వర్టబుల్ హోల్ లైఫ్ అష్యూరెన్స్ (గ్రామ సువిధ)
- ఎండోమెంట్ అష్యూరెన్స్ (గ్రామ సంతోష్)
- పదేండ్ల గ్రామీణ పీఎల్ఐ (గ్రామ ప్రియ)
- యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అష్యూరెన్స్ (గ్రామ సుమంగళ్)
- చిల్డ్రెన్ పాలసీ (బాల జీవన్ బీమా)

లాభాల స్వీకరణకు అవకాశం!

మార్కెట్ పల్స్

గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డుల మోత మోగించాయి. వరుస ట్రేడింగ్ సెషన్లలో ఆకర్షణీయ లాభాలనే అందుకున్నాయి. అయితే చివరి రోజున మాత్రం మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. ఫలితంగా సూచీలు నయా ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడలేకపోయాయి. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,822.83 పాయింట్లు లేదా 2.36 శాతం పెరిగి 79వేల స్థాయికి ఎగువన 79,032.73 వద్ద స్థిరపడింది. అలాగే ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 509.50 పాయింట్లు లేదా 2.16 శాతం అందిపుచ్చుకుని 24వేల స్థాయిని దాటి 24,010.60 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మదుపరులు లాభాల స్వీకరణకు దిగవచ్చన్న అంచనాలున్నాయి. సూచీలు దాదాపు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతుండటమే కారణం. మదుపరులు పెట్టుబడుల జోష్‌ను కొనసాగించేందుకూ వీలు లేకపోలేదంటున్నారు. జూన్ నెల వాహన విక్రయాలు, జీఎస్టీ వసూళ్లు తదితర అంశాలు మార్కెట్ ట్రెండ్‌ను ప్రభావితం చేయవచ్చు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,700 పాయింట్ల స్థాయి కీలకం. దీనికి దిగువన ముగిస్తే 23,400 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చు. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,400-24,600 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని చెప్తున్నారు.

హెల్త్ ఇన్సూరెన్స్‌ను అందరికీ దగ్గర చేసేందుకు క్యాష్‌లెస్ చికిత్స నుంచి క్లెయిమ్ సెటిల్మెంట్ వరకు ఇటీవల పలు మార్పులను చేసింది ఐఆర్డీఏఐ.

ఆరోగ్య బీమాలో మార్పులొచ్చాయ్

- వయసుతో సంబంధం లేకుండా అందరూ ఆరోగ్య బీమాను తీసుకోవచ్చు. సీనియర్ సిటిజన్లకు ఇది గొప్ప ఊరట.
- గుండె జబ్బు, క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, ఎయిడ్స్ రోగులకూ ఆరోగ్య బీమా.
- డిశ్చార్జి అభ్యర్థన వస్తే మూడు గంటల్లోగా బీమా సంస్థలు తుది అనుమతి ఇవ్వాలి.
- ఆయుర్వేద, యోగా, నాచురోపతి, సిద్ధ, యునానీ, హోమియోపతికీ బీమా.
- ముందున్న షుగర్, బీపీ వంటి అనారోగ్య సమస్యలకు ఇన్సూరెన్స్ కవరేజీ ఉండాలంటే పాలసీ కొన్న నాలుగేండ్ల తర్వాతే వీలుపడేది. అయితే దీన్ని మూడేండ్లకు తగ్గించారు. జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జరీ వంటి స్పెసిఫిక్ డీసీజ్‌లు/ప్రొసీజర్ల వెయిటింగ్ పీరియడ్ కూడా మూడేండ్లే.
- మీరు పాలసీ తీసుకున్న బీమా సంస్థతో లింకైన దవాఖానలేగాక ఇతర దవాఖానల్లో చికిత్స తీసుకున్నా క్యాష్‌లెస్ వైద్య సదుపాయం.
- ఆరోగ్య బీమాలో మారటోరియం వ్యవధిని 8 ఏండ్ల నుంచి 5 ఏండ్లకు తగ్గింపు. రెగ్యులర్ పాలసీదారుల క్లెయిమ్‌ల తిరస్కరణ తగ్గనున్నది.
- మీకు ఒకటి కన్నా ఎక్కువ పాలసీలుంటే.. చికిత్స ఖర్చును క్లెయిమ్ చేసుకోవడానికి వాటన్నిటినీ ఒకేసారి వినియోగించుకోవచ్చు.
- ఇండెమ్నిటీ ఆధారిత పాలసీలు వద్దన్న ఐఆర్డీఏఐ.. బెనిఫిట్ ఆధారిత పాలసీలనే ఇవ్వాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్పష్టం చేసింది. దీనివల్ల పాలసీదారులకు నిర్దిష్ట దవాఖాన ఖర్చులు అందుతాయి.